సాక్షి
కుమురం భీం

గురువారం ; 22 ; జూన్ ; 2023



లాభాలు తెస్తున్న 'లాజిస్టిక్స్'

కార్గో సర్వీస్ ఆర్టీసీ సంస్థకు లాభాలు తెచ్చిపెడుతోంది. 2020 జూన్ 19న ప్రారంభమైన లాజిస్టిక్స్ సేవలకు వినియోగదారుల నుంచి ఆదరణ లభిస్తోంది. 4లో▸

నేడు ప్రత్యేక సమావేశం

ఆసిఫాబాద్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈవో రత్నమాల ఒక ప్రకటనలో తెలిపారు. అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నట్లు వెల్లడించారు. గౌరవ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.4/28.2

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కూడా తగ్గుతుంది. సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎం జిల్లా పర్యటన 26కి వాయిదా?

సాక్షి, ఆసిఫాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన వాయిదా పడింది. ఈ నెల 24న జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని భావించగా.. ఆ రోజు కొత్తగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్, జిల్లా పోలీసు, బీఆర్ఎస్ కార్యాలయాలు ప్రారంభించడంతోపాటు ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయాల్సి ఉంది. అయితే ఎన్నికల కమిషన్ ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనను 26కి మార్పు చేసినట్లు సమాచారం. అధికారికంగా పర్యటన వివరాలు ఖరారు కావాల్సి ఉంది.

క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించాలి


మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల లో క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరాల దర్యాప్తులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. నేరస్తులకు చట్టప్రకారం శిక్షపడేలా సాక్ష్యాధారాలు సేకరించాలని సూచించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని, పోలింగ్ కేంద్రాలు, వాటి స్థితిగతులు, భౌగోళిక పరిస్థితులను అంచనా వేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సిబ్బంది వివరాలు తెలియజేయాలని సూచించారు. సరిహద్దులోని చెక్‌పోస్టులను ఎప్పటికప్పుడు తనిఖీ ఆదేశించారు. మండల, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. గోవుల అక్రమ రవాణా నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంతలో కొనుగోలు చేసిన పశువులకు సంబంధిత పశువైద్యాధికారితో ఆరోగ్య, రవాణాకు అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా వివరాలు తెలుసుకున్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ నిర్వహించిన సురక్షా దినోత్సవం, తెలంగాణ రన్ వంటి కార్యక్రమాలు విజయవంతం చేయడంలో కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, ఎస్‌బీ సీఐ సుధాకర్, డీసీఆర్‌బీ సీఐ పవన్‌కుమార్, డీపీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నైతిక విలువల పరీక్షకు భారీగా గైర్హాజరు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం నైతిక విలువల పరీక్ష నిర్వహించినట్లు డీఈఐవో శ్రీధర్‌సుమన్ తెలిపారు. మొత్తం 383 మంది విద్యార్థులకు 67 మంది హాజరు కాగా 316 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 265 మందికి 58 హాజరు కాగా, 207 పరీక్షలు రాయలేదు. అలాగే ఒకేషనల్ విభాగంలో 118 మంది విద్యార్థులకు కేవలం తొమ్మిది మందే హాజరు కాగా, 109 గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను డీఐఈవో తనిఖీ చేశారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలి


ఎల్లూర్‌లోని నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్, ఎంపీడీవో గంగాసింగ్

పెంచికల్‌పేట్(సిర్పూర్): హరితహారం కార్యక్రమంలో నాటేందుకు వీలుగా నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. మండలంలోని ఎల్లూర్, కమ్మర్‌గాం నర్సరీలను బుధవారం పరిశీలించారు. అనంతరం కమ్మర్‌గాం గ్రామంలో ఎస్‌కేజీ సంస్థ నిర్మించిన గోబర్ గ్యాస్ ప్లాంట్లను సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాసింగ్, సర్పంచులు రాజన్న, మధునయ్య, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, ఏపీవో సతీశ్, ఎస్‌బీఎం సాయి తదితరులు ఉన్నారు.

నోటే బంగారమాయే!

- బ్లాక్ మార్కెట్లో గోల్డ్ బిజినెస్
- వినూత్నంగా రూ.2 వేల నోట్ల మార్పిడి
- ఆభరణాల కొనుగోళ్లలో బడాబాబులు బిజీ
- మార్కెట్ ధర కంటే అధికంగా చెల్లిస్తున్న వైనం
- జిల్లాలో తులం బంగారం రూ.75 వేల ఫైమాటే..
- అక్రమ మార్గంలో రూ.కోట్లు పోగేసుకుంటున్న జ్యువెలరీ వ్యాపారులు



సాక్షి, ఆసిఫాబాద్: 'సవాకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు' అన్నట్లుగా ఆర్‌బీఐ అధికారులు రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటే బడాబాబులు మాత్రం వాటిని బంగారం రూపంలో మార్చుకుంటున్నారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముకు లెక్కలు చూపడం తలనొప్పిగా భావించిన కొందరు వేర్వేరు మార్గాల్లో ఆ డబ్బును పెట్టుబడులుగా పెడుతున్నారు. ముఖ్యంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో డబ్బున్న ఆసాములు అక్రమ సొమ్మును బంగారు కొనుగోళ్లకు వెచ్చిస్తున్నట్లు సమాచారం. బడాబాబుల అవసరాన్ని ఆదాయ వనరుగా మార్చుకుంటున్న జ్యువెలరీ వ్యాపారులు బంగారాన్ని అధిక ధరకు కొనుగోలు చేస్తేనే రూ.2 వేల నోట్లు తీసుకుంటామని షరతు పెట్టడం గమనార్హం.

మేలో పెద్దనోటు ఉపసంహరణ నిర్ణయం..

నవంబరు 8, 2016లో ప్రధాని నరేంద్రమోదీ రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించగానే.. సామాన్యుడి నుంచి మొదలుకొని వ్యాపారులు, బడాబాబులు బ్యాంకుల వద్ద క్యూ కట్టిన విషయం విదితమే. రద్దయిన రూ.500, రూ.1000 నోట్ల స్థానంలో కొత్తగా రూ.2000, రూ.500, రూ.200, రూ.100 తదితర నోట్లు విడుదల చేశారు. వీటిలో రూ.2000 నోట్లు మినహా అన్నినోట్లు ప్రస్తుతం మార్కెట్లో కనిపిస్తున్నాయి. రూ.2000 నోట్లు మాత్రం బ్యాంకు నుంచి బయటకు వెళ్లడమే కానీ తిరిగి అవి బ్యాంకులకు చేరడం లేదు. మార్కెట్లోనూ తిరగడం లేదు. కేవలం కొద్దిమంది చేతుల్లోనే నోట్లు ఉండిపోతున్నాయని గ్రహించిన ఆర్‌బీఐ అధికారులు మే 22న రూ.2000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు.

బంగారంపై పెట్టుబడి..

జిల్లాలో కొందరు వ్యక్తులు మాత్రం వినూత్నంగా ఆలోచించి రూ.2000 నోట్ల మార్పిడికి శ్రీకారం చుట్టారు. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం కష్ట పడకుండానే పెద్దనోట్లను వదిలించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగానే తమ వద్ద ఉన్న ట్యాక్స్ పరిధిలోకి రాని డబ్బును బంగారంపై పెట్టుబడిగా పెట్టాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో సుమారు 40కి పైగా జ్యువెలరీ దుకాణాలు ఉన్నాయి. పొరుగునే మహారాష్ట్రకు సరిహద్దున జిల్లా ఉండడంతో ఇక్కడ జ్యువెలరీ వ్యాపారం పెద్దఎత్తున సాగుతోంది. ముఖ్యంగా పత్తిపంట చేతికొచ్చే సమయంలోనూ, పండగల వేళ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో జ్యువెలరీ దుకాణాలు వినియోగదారులతో నిత్యం కిక్కిరిసిపోతుంటాయి.

నోట్ల మార్పిడికి డిమాండ్..

నోట్ల మార్పిడికి రోజురోజుకూ డిమాండ్ పెరుగుతుండడంతో జ్యువెలరీ వ్యాపారులు బంగారం కొనుగోళ్లపై పలు షరతులు విధిస్తున్నట్లు తెలుస్తోంది. బంగారం కొనుగోళ్లకు వచ్చిన వారెవరైనా రూ.2000 నోట్లు ఇస్తే మొదట తీసుకోమని కరాఖండిగా చెబుతున్నారు. ఆ తర్వాత తాము చెప్పిన ధరకే బంగారాన్ని కొనుగోలు చేస్తేనే నోట్లు తీసుకుంటామని పేర్కొంటున్నట్లు సమాచారం. కొన్ని రోజులుగా మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం(10గ్రాములు) రూ.60,000 ఉండగా.. ఆర్నమెంట్ ధర రూ.55,000 ఉంది. అయితే జిల్లాలో జ్యువెలరీ వ్యాపారులు మాత్రం రూ.2000 నోట్లతో బంగారం కొనుగోలు చేస్తే మాత్రం 10 గ్రాముల బంగారం ఏదైనా రూ.75 వేలు చెల్లించాలనే షరతు విధిస్తున్నారు. దీంతో నోట్లు మార్చుకునే వారంతా బిస్కెట్ల రూపంలో ఉన్న బంగారాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. 10 గ్రాములపై రూ.15వేలు అధికంగా చెల్లించి తమ వద్దనున్న అక్రమ డబ్బును మార్చుకుంటున్నారని సమాచారం. స్వామి కార్యం... స్వకార్యం కలిసి వచ్చినట్లుగా భావిస్తున్న జ్యువెలరీ వ్యాపారులు నోట్ల మార్పిడి ముసుగులో రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. అయితే దీనిని ఆరికట్టాల్సిన సంబంధిత అధికారులు ఎవరూ దృష్టి సారించకపోవడంతో అక్రమ మార్గంలో డబ్బు చేతులు మారుతోంది.

వీరులారా వందనం!



ఈమె పేరు లక్ష్మి. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామం. ఆమె కొడుకు నాయకిని నగేశ్ 23ఏళ్ల వయస్సులో తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేశాడు. ఓయూ క్యాంపస్‌లో పీజీ చేసిన అతడు 2011లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జాప్యాన్ని నిరసిస్తూ ఓ లేఖ రాసి మంచిర్యాల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం చివరలో రైలుకు ఎదురెళ్లి చనిపోయాడు. ఆ సమయంలో ఓయూ క్యాంపస్‌తోపాటు పెద్దయెత్తున ఉద్యమం ఎగిసింది. మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య, తదితరులు వచ్చి నివాళులు అర్పించి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రూ.లక్ష సాయం చేశారు. అంతకుమించి ఎటువంటి సాయం అందలేదని తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది.

- రాష్ట్ర సాధనకు అనేకమంది ఆత్మబలిదానం
- కొందరికే అందిన ప్రభుత్వ సాయం
- ఉమ్మడి జిల్లాలో 27మందికి రూ.పది లక్షల సాయం
- ఇంకా అనేక కుటుంబాలకు ఎదురుచూపులే..
- నేడు అమరుల సంస్మరణ దినోత్సవం


ఆసిఫాబాద్ పట్టణంలోని అమరవీరుల స్తూపం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎంతోమంది ఆత్మబలిదానాలతో నేటి స్వరాష్ట్రం ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయి పదో ఏడాదిలోకి అడుగు పెడుతున్న వేళ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా నేడు గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. అమరుల్లో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎంతోమంది తెలంగాణ ఏర్పాటును కాంక్షిస్తూ ఆత్మబలిదానం చేశారు. వీరిలో కొందరికి మాత్రమే ప్రభుత్వం నుంచి సాయం అందింది. మరికొందరికి స్థానిక నాయకులు, రాజకీయ పార్టీల నుంచి సాయం అందింది. ఇప్పటికీ తమ కుటుంబాలకు న్యాయం జరగలేదని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న వారిలో 27మందికి రూ.పది లక్షల చొప్పున ఆర్థిక సాయం అందింది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. కొందరికి ఇవ్వాల్సి ఉంది. బెల్లంపల్లిలో తెలంగాణ ఉద్యమంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో పిన్న రాజ్‌కుమార్ అనే వ్యక్తి భార్య పద్మకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించారు. ప్రస్తుతం మంచిర్యాల ఆర్డీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తోంది. ప్రభుత్వ పరంగా రూ.10 లక్షల ఆర్థిక సాయం కూడా అందజేశారు.

- 2012లో ఆదిలాబాద్‌కు చెందిన సంతోష్ హైదరాబాద్‌లోని ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతుండేవాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఓయూ క్యాంపస్‌లో ఆర్ట్స్ కాలేజీ ముందే ఓ చెట్టుకు ఉరి వేసుకుని ప్రాణత్యాగం చేశాడు. ఆత్మహత్యతో ఓయూ అట్టుడికింది. అమరుని కుటుంబానికి రూ.పది లక్షల సాయం అందింది.
- 2013లో ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడకు చెందిన పుంద్రువార్ నర్సింగ్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. అప్పట్లో ఎమ్మెల్యే జోగు రామన్న నేతృత్వంలో రాస్తారోకో చేశారు. ఈయన కుటుంబంలో ఒకరి ఉద్యోగం, రూ.పది లక్షల సాయం అందింది.

అమరుల కుటుంబాలకు అందని సాయం

- బెల్లంపల్లికి చెందిన శ్రీనివాస్, రాజు అనే ఇద్దరు యువకులు కూడా స్వరాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్నారు. కానీ వీరి ఆత్మహత్య కేసు పోలీసు రికార్డుల్లో నమోదు కాలేదు. అందువల్ల ఇరువురు బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందలేదు. ఉద్యోగ అవకాశం కల్పించలేదు.
- చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామానికి చెందిన ముత్యాల రాజగౌడ్, సుబ్బారాంపల్లి గ్రామానికి చెందిన బిల్కి మహేష్ ప్రాణత్యాగం చేశారు.

అమరవీరుల ఆకాంక్షలు నెరవేరలే..



తెలంగాణ వస్తే బతుకులు బాగుపడుతాయని అనేక మంది ఆత్మబలిదానాలు చేసుకుంటే ఇప్పటికీ వారి ఆకాంక్షలు నెరవేరలే. కుటుంబ, గడీల పాలనలో సామాజిక న్యాయం జరగలేదు. ప్రజలు కోరుకున్న తెలంగాణ రాలేదు. నేటికీ రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

– దుర్గం భాస్కర్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, ప్రార్థనలు


జిల్లా కేంద్రంలోని చర్చిలో ప్రార్థనలు


మసీదు కమిటీ ఆధ్వర్యంలో ప్రార్థనలు

ఆసిఫాబాద్: అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. మసీద్ కమిటీ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశం, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, అర్చకులు, పాస్టర్లు, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఆసిఫాబాద్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్‌పార్కు ఆవరణలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఎంహెచ్‌వో రామకృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేశారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక వ్యాధులు నయం చేసుకోవచ్చన్నారు. పతంజలి మహర్షి మానవాళికి అందించిన అపురూపమైన వైద్య కానుక యోగా అని పేర్కొన్నారు. ఏడాదిలో పగటి సమయం ఎక్కువగా ఉండటం జూన్ 21వ తేదీ ప్రత్యేకత తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రశాంతత అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్

ఆసిఫాబాద్: జీవితంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తులు యువరాజ్, ఉమామహేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు, బ్రహ్మకుమారి అంజలితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ వృత్తి జీవితంలో ప్రతిఒక్కరూ ఒత్తిడికి గురవుతారని, యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తోందన్నారు. కుటుంబ సమస్యలు, సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ప్రశాంతత అవసరమన్నారు. యోగాతో సమస్యల పరిష్కారంతోపాటు క్రమశిక్షణ అలవాటవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తక్కువ సమయంలో ఎక్కువ పని చేస్తూ ఉంటారని, యోగా సాధన పనులను సమర్థవంతంగా నిర్వహించడంలో తోడ్పాడుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

అందని పత్రాలు.. అంతంతే దరఖాస్తులు

- ముగిసిన బీసీ కులవృత్తుల ఆర్థికసాయం దరఖాస్తుల గడువు
- సర్వర్లు మొరాయించడంతో లబ్ధిదారులకు తిప్పలు
- జిల్లాలో 5,558 దరఖాస్తులు
- అత్యధికంగా ఆసిఫాబాద్ మండలం నుంచే..

మండలాల వారీగా దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
ఆసిఫాబాద్	764
బెజ్జూర్	339
చింతలమానెపల్లి	344
దహెగాం	376
జైనూర్	216
కాగజ్‌నగర్	461
కాగజ్‌నగర్(పట్టణం)	437
కెరమెరి	379
కౌటాల	535
లింగాపూర్	150
పెంచికల్‌పేట్	181
రెబ్బెన	619
సిర్పూర్-టి	347
సిర్పూర్-యూ	50
తిర్యాణి	134
వాంకిడి	226


ఆసిఫాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారుల రద్దీ (ఫైల్)

ఆసిఫాబాద్: బీసీ కుల వృత్తులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం కోసం జిల్లాలోని 15 మండలాల నుంచి కేవలం 5,558 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సర్వర్లు మొరాయించడంతో లబ్ధిదారులకు సకాలంలో ధ్రువపత్రాలు అందలేదు. జిల్లాలో చాలా మందికి పథకంపై అవగాహన లేకపోవడంతో కూడా పథకానికి దూరమైనట్లు తెలుస్తోంది. ఒక్క మండలం నుంచి కూడా దరఖాస్తులు 1000 దాటలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అత్యధికంగా ఆసిఫాబాద్ మండలంలో 764 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా సిర్పూర్(యూ)లో కేవలం 50 దరఖాస్తులు వచ్చాయి. దళిత బంధు తరహాలో బీసీలకు ఆర్థిక చేయూతనందించేందుకు సాయమందించాలని ప్రభుత్వం నిర్ణయించి, ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. గడువు పొడిగిస్తారని భావించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో చాలా మంది ప్రభుత్వ సాయానికి దూరమయ్యారు.

తొలివిడతలో 15 కులాలకు అవకాశం

వెనుకబడిన తరగతుల్లోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం తొలుత 15 బీసీ కులాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది. ఆ తర్వాత మిగిలిన వారికి ప్రాధాన్యత క్రమంలో అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 9న సీఎం కేసీఆర్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఎంపిక చేసిన ఐదుగురికి ఆర్థికసాయం అందజేశారు. ఈ క్రమంలో ఈ నెల 6 నుంచి 20 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చిన వారికి కూడా అవకాశం కల్పించారు. పద్మశాలి కులస్తులు తమకు కూడా జాబితాలో అవకాశం కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు వినతులు సమర్పించారు. తొలి విడతలో నాయీబ్రాహ్మణ, రజక, సాగర ఉప్పర, కుమ్మరి, శాలివాహన, అవుసుల, కంసాలి, కమ్మరి, వడ్రంగి, సిల్పిస్, క్రిష్ణ బలిజపూసల, మేదర, హరికటిక, మేరు, ఎంబీసీలకు అవకాశం కల్పించారు. అనంతరం మిగిలిన కులాలాకు పథకం వర్తింపజేయనున్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు ఒకేసారి అప్‌లోడ్ అవుతుండడంతో సర్వర్ మొరాయించింది. ఈ క్రమంలో దరఖాస్తు దారులు గంటల తరబడి మీసేవ కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి పరిస్థితి ఏర్పడింది.

ఎంపీడీవో కార్యాలయాల్లో పరిశీలన

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రూ.లక్ష ఆర్థికసాయం మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను అన్ని మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో బుధవారం నుంచి పరిశీలన ప్రారంభించారు. ఈ నెల 26 వరకు దరఖాస్తుల పరిశీలన అనంతరం దరఖాస్తులను కలెక్టర్‌కు పంపించనున్నారు. అనంతరం ఎంపిక కమిటీ వాటిని మరోసారి పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తోంది. జాబితాను జిల్లా మంత్రికి పంపిస్తారు. ఈ నెల 27 నుంచి జూలై 4 వరకు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు.

26 వరకు పరిశీలన

జిల్లాలో రూ.లక్ష సాయం కోసం 5,558 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 26 వరకు ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తుల పరిశీలన ఉంటుంది. ఆ తర్వాత దరఖాస్తులను కలెక్టర్‌కు పంపించాల్సి ఉంటుంది. దరఖాస్తుల గడువు పెంచుతున్నట్లు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు.

– సత్యనారాయణ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి

క్లుప్తంగా

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

వేమనపల్లి: మంత్రాల నెపంతో దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు. జక్కపల్లి గ్రామానికి చెందిన తొర్రెం బానేష్ కుమారుడు ఆరునెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. తన బావ సిడాం వెంకటి మంత్రాలు చేయడంతోనే తన కుమారుడు అనారోగ్యానికి గురయ్యాడని కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 9న గడ్డపారతో వెంకటిపై దాడికి పాల్పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బానేష్‌పై కేసు నమోదు చేసి బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి


ఈగం మల్లేశ్ (ఫైల్)

నెన్నెల: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని గొల్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్యాంపటేల్ తెలిపిన వివరాల ప్రకారం... గొల్లపల్లికి చెందిన వేల్పుల మొగిళి ట్రాక్టర్‌పై మైలారం గ్రామానికి చెందిన ఈగం మల్లేశ్ (22) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రినుంచి చెరువుమట్టిని రైతుల పొలాలకు తరలిస్తుండగా బుధవారం తెలవారుజామున నిద్రమత్తులో జారి ట్రాక్టర్ కింద పడిపోయాడు. ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి భీమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోటపల్లి(చెన్నూర్): ఈ నెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన పెద్ద కొమురయ్య (44) గతేడాది రెండెకరాల భూమి కౌలుకుతీసుకుని మిర్చి సాగు చేశాడు. దిగుబడి రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు కావడంతో అతని భార్య లక్ష్మి పుట్టింటికి ఎడగట్టుకు వెళ్లిపోయింది. ఈ నెల 4న ఎడగట్టుకు వెళ్లి కాపురానికి రావాలని కోరగా నిరాకరించడంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జైపూర్(చెన్నూర్): మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి శ్రీధర్ భీమారం నుంచి జైపూర్ వెళ్తుండగా ఫోన్ పోగొట్టుకున్నాడు. జైపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌ద్వారా ఫోన్‌ను గుర్తించి బుధవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

డిగ్రీ విద్యార్థి డిబార్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని డిబార్ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ మల్లారెడ్డి, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ నరేందర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు హాజరైన విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు.

లాభాలు తెస్తున్న 'లాజిస్టిక్స్'

2020 జూన్ 19 నుంచి 2023 జూన్ 19 వరకు డిపోల వారీగా ఆదాయం

డిపో	పార్శిళ్లు	సమకూరిన ఆదాయం
మంచిర్యాల	2,48,719	రూ.2,78,30,941
ఆదిలాబాద్	1,34,003	రూ.1,50,17,333
నిర్మల్	1,31,155	రూ.1,34,94,133
ఆసిఫాబాద్	85,905	రూ.1,05,47,853
భైంసా	39,492	రూ.51,96,256
ఉట్నూర్	11,112	రూ.9,65,805
మొత్తం	6,50,386	రూ.7,30,52,321

- ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణ
- వేగంగా పార్శిల్స్ చేరవేత
- సేవలు ప్రారంభించి మూడేళ్లు



ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ లాజిస్టిక్స్ బుకింగ్ కార్యాలయం

ఆదిలాబాద్: నష్టాల ఒడిదుడుకుల మధ్య ముందుకు సాగుతున్న ఆర్టీసీకి కార్గో సర్వీస్ బూస్ట్ నిచ్చింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ప్రజా రవాణా సంస్థ పలు కారణాల చేత నష్టాల ఊబిలో కూరుకుపోయింది. ఆర్టీసీని నష్టాలనుంచి గట్టెక్కించి లాభాలబాట పట్టేలా సంస్థ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మంచి ఆదాయం వనరుగా మారింది. 2020 జూన్ 19న ప్రారంభమైన ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కథనం.

ఉపాధినందిస్తూ.. విస్తృతం చేస్తూ

కార్గో సేవలను అన్ని మండలాలకు విస్తరించడంలో భాగంగా సర్వీస్ ఏజెంట్లను నియమించారు. మండల కేంద్రాల్లో కమీషన్ ప్రాతిపదికన ప్రైవేట్ ఏజెంట్లను నియమించారు. లాజిస్టిక్స్ కమీషన్ ఏజెంట్లకు పార్సిల్ బుకింగ్స్ మీద 12 శాతం, పార్శిల్ రిసీవింగ్ మీద ఒక్కోదానిపై పది రూపాయల కమీషన్ చెల్లిస్తున్నారు. దీంతో సేవలు క్షేత్రస్థాయిలో అందుతుండడంతో పాటు పలువురు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. కమీషన్ ఏజెంట్లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పార్శిళ్లను వినియోగదారులకు అందజేయడం, తమ ప్రాంతాల నుంచి పార్శిళ్లను బుక్ చేయడం ద్వారా రెండు రకాలుగా ఆదాయం పొందుతున్నారు. రీజియన్ పరిధిలో 30 లాజిస్టిక్స్ ఏజెన్సీలు ఉండగా, 4 ఆర్టీసీ బుకింగ్ కార్యాలయాలు ఉన్నాయి.

రూ.7.30 కోట్ల ఆదాయం

లాజిస్టిక్స్ ద్వారా అందిస్తున్న సేవలతో ఆదాయం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. సగటున రోజుకు ఎనిమిది వందల వరకు బుకింగ్స్ జరుగుతుండగా, లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తోంది. అత్యధికంగా మంచిర్యాల డిపో పరిధిలో 2.48 లక్షల పార్శిళ్లు బుక్ చేయగా రూ.2.78 లక్షల ఆదాయం వచ్చింది. రీజియన్ వ్యాప్తంగా ఇప్పటివరకు 6,50,386 పార్శిళ్లు బుక్ చేయగా రూ.7.30 కోట్ల ఆదాయం సమకూరింది.

- పార్శిళ్లు, కవర్లు, సరుకు రవాణా చేయడమే కాకుండా ప్రజలను ఆకట్టుకునేలా వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టడం, రాయితీలు ప్రకటించడం, ప్రత్యేక సందర్భాల్లో పలు ఆఫర్లు ఇవ్వడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను అందించడం ద్వారా రాఖీ సమయంలో పెద్ద ఎత్తున ఆదాయం వచ్చింది.
- **మేడారం మొక్కులు :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో జాతర వరకూ ప్రయాణించలేని భక్తులు మొక్కులు చెల్లించడానికి ఆర్టీసీ కార్గో సేవల ద్వారా అవకాశం కల్పించారు. అమ్మవార్లకు బంగారం (బెల్లం) సమర్పించడానికి కార్గో కౌంటర్ల ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పించారు.

కాలానుగుణం.. నిత్య నూతనం

- **రాములోరి తలంబ్రాలు:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించలేని, భద్రాచలానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం రాములోరి తలంబ్రాలను భక్తులకు అందజేశారు. రూ.116 చెల్లిస్తే తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చారు.
- **ధాన్య సేకరణ:** రైతుల పంట ఉత్పత్తులను కల్లాల నుంచి నేరుగా మార్కెట్‌కు కార్గో ద్వారా అతి తక్కువ ఖర్చుతో రవాణా చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా రైతులకు రవాణా సులభం అవ్వడమే కాకుండా నేరుగా మార్కెట్‌కు తరలించడం వలన గిట్టుబాటు ధర లభ్యమైంది.
- **హోండెలివరీ సేవలు:** మొదట్లో పార్శిల్, కొరియర్ బుక్ చేయాలంటే బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా బుకింగ్ చేయాల్సి ఉండేది. అంతేకాకుండా బస్టాండ్‌కు వచ్చి సంబంధిత కవర్లను తీసుకోవాల్సి వచ్చేది. అయితే ప్రజలకు సేవలను మరింతగా చేరువ చేసేందుకు హోమ్ డెలివరీ సేవలను సైతం కార్గో ప్రారంభించింది. ఎంపిక చేసిన పట్టణ ప్రాంతాల్లో దీని ద్వారా వస్తువులను ఇంటివద్దకు వెళ్లి పికప్ చేసుకోవడం, డెలివరీ చేయడం లాంటి సేవలు అందిస్తున్నారు.
- **బంగినపల్లి మామిడి:** వేసవి కాలంలో ఎంతో రుచికరమైన బంగినపల్లి మామిడి పళ్లను బుక్ చేసుకున్నవారికి చేరవేశారు.

క్విక్ అండ్ సేఫ్..

ఆర్టీసీ కార్గో, పార్శిల్ సర్వీస్ ద్వారా చాలా వేగంగా సేవలు అందుతుండడంతో వినియోగదారులు లాజిస్టిక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ కొరియర్ సంస్థల ద్వారా పార్సిల్ గమ్యస్థానానికి చేరుకోవాలంటే 24 నుంచి 48 గంటల సమయం పడుతుంది. ప్రజారవాణాసంస్థ ఆర్టీసీకి 80 శాతానికి పైగా ప్రాంతాలకు బస్సు సౌకర్యం ఉండడంతో కార్గో సేవలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఈ సౌలభ్యాన్ని ఆసరాగా చేసుకుని ఆర్టీసీ కార్గో ద్వారా గంటల వ్యవధిలోనే పార్శిల్స్ గమ్యస్థానానికి చేరుకుంటున్నాయి. అంతేకాకుండా వినియోగదారుల నమ్మకాన్ని నిలబెడుతూ వారు అందించిన పార్శిళ్లు, కవర్లను సురక్షితంగా చేరవేస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆర్టీసీ సంస్థ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

అందుబాటు ధరల్లో..

ఆర్టీసీలో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటారు. వారికి అందుబాటు ధరల్లో కార్గో సేవలను అందజేస్తే పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో అధికారులు తక్కువ ఛార్జీలను తీసుకోవాలని నిర్ణయించారు. ప్రైవేట్ కార్గో సంస్థల కన్నా తమ సేవలను తక్కువ ధరలకు అందిస్తామని విస్తృత ప్రచారం చేశారు. దీనికి అనుగుణంగానే చార్జీలు తీసుకుంటున్నారు.

సురక్షితమైన సేవలు..



ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌ల ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చయ్యేవి. మళ్లీ పార్శిల్ సకాలంలో చేరుతుందో లేదోనని ఎదురుచూడాల్సి వచ్చేది. ఆర్టీసీ ఆధ్వర్యంలో లాజిస్టిక్స్ సేవలు చాలా మెరుగ్గా అందజేస్తున్నారు. పార్శిళ్లను కేవలం 24 గంటల్లోనే సురక్షితంగా చేరవేస్తున్నారు. తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందిస్తున్నారు.
– రఘు, ఖానాపూర్, ఆదిలాబాద్

సేవలు మరింత విస్తృతం



ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలను ప్రజలు ఆదరిస్తున్నారు. ప్రతి సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. సురక్షితంగా పార్శిల్ కవర్లను గమ్యస్థానాలకు చేరవేస్తుండడంతో ప్రజలు నమ్మకంతో ముందుకు వస్తున్నారు. త్వరలో గ్రామాల్లోనూ హోమ్ డెలివరీ సేవలు ప్రారంభించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ సేవలు సైతం ప్రారంభమైతే లాజిస్టిక్స్ సేవలు మరింత విస్తృతం అవుతాయి.
– బి.శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, లాజిస్టిక్స్, ఆదిలాబాద్ రీజియన్

యోగా జీవితంలో భాగం కావాలి

- జీఎం సంజీవరెడ్డి
- సింగరేణిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం


శ్రీరాంపూర్: యోగా చేస్తున్న జీఎం సంజీవరెడ్డి


రెబ్బెన : యోగాసనాలు వేస్తున్న జీఎం దేవేందర్

శ్రీరాంపూర్(మంచిర్యాల): దైనందిక జీవితంలో యోగా భాగం కావాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జీఎం పాల్గొని అధికారులు, ఉద్యోగులతో కలిసి యోగా చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ పీ రమేష్ బాబు, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం చిరంజీవులు సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళి మోహన్, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, యోగా గురువులు బక్కయ్య, సాంబయ్య , తదితరులు పాల్గొన్నారు.

గనులపై..
ఆర్కే 7, ఆర్కే 6 గనులపై జరిగిన కార్యక్రమంలో రక్షణాధికారులు రవిశంకర్, కాదాసి శ్రీనివాస్, పిట్ ఇంజనీర్ శ్యాంకుమార్, డెప్యూటీ మేనేజర్ ఆర్.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓసీపీలో..
ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తంరెడ్డి ఉద్యోగులతో యోగా ప్రతిజ్ఞ చేయించి వారితో కలిసి యోగా చేశారు. యోగా గురువు గద్దం రాజేశ్వర్, గని మేనేజర్ సుధీర్, గుర్తింపు సంఘం నాయకులు డీ.అన్నయ్య, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్ రక్షణాధికారి శ్రీనివాస్, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు. ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీఎం చంద్రశేఖర్ రెడ్డి, ఇంజనీర్లు సిరికొండ మల్లయ్య, రాకేష్‌రెడ్డి, రవికుమార్, పిట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో యోగాను భాగం చేయాలి
రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రతి ఒక్కరూ జీవితంలో యోగా సాధనను భాగంగా మార్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం కార్యాలయ ఉద్యోగులు, సేవా సమితి సభ్యులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరంతర యోగా సాధనతో అనేక శారీరక రుగ్మతలను దూరం చేసుకోవచ్చన్నారు. యోగా శిక్షకులను సన్మానించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాల్లో సేవా అధ్యక్షురాలు స్వరూపారాణి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, ఎస్‌వోటూ జీఎం గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎంలు సతీష్‌బాబు, రామారావు, ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణా మరింత పెంచాలి


రెస్ట్‌హాల్ ప్రారంభిస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్: బొగ్గు రవాణా మరింత పెంచాలని సింగరేణి(ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో నూతనంగా నిర్మించిన రెస్ట్‌హాల్‌ను ప్రారంభించారు. అనంతరం సీహెచ్‌పీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణా మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, ఏరియా ఇంజనీర్ రమేశ్‌బాబు, సీహెచ్‌పీ డీజీఎం వెంకటేశ్వరరావు డీజీఎం సివిల్ శివరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్, గుర్తింపు సంఘం నాయకులు లక్ష్మణ్, వెంగల కుమారస్వామి, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి భాగ్యరాజ్, ఐఎన్టీయూసీ బ్రాంచిఉపాధ్యక్షుడు శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

ఈదులవాడలో వృద్ధుడి హత్య


మల్లయ్య(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: వృద్ధుడిని దారుణంగా హత్య చేసిన ఘటన ఆసిఫాబాద్ మండలంలోని ఈదులవాడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారశెట్టి మల్లయ్య (75) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి ఇంటిముందు వాకిట్లో మంచంపై పడుకున్నారు. తెల్లవారుజామున అతని కుమార్తె లూచి వాకిలి ఊడుస్తూ తండ్రిని లేపగా లేవకపోవడంతో కుటుంబ సభ్యులకు చెప్పింది. అందరూ వచ్చి చూడగా అతని మెడ మీద కత్తితో కోసినట్లు ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రమేశ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తన రెండో కుమార్తె అత్తగారి తరఫు వ్యక్తి గతంలో చంపుతానని బెదిరించాడని మృతుని భార్య కాంతమ్మ తెలిపింది. అతని మీద అనుమానం ఉందని చెప్పడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మ్యాన్‌రైడింగ్ పనులు ప్రారంభం

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట 2గనిపై బుధవారం గని మేనేజర్ లక్ష్మీనారాయణ మ్యాన్ రైడింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదునెలల్లో పనులు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రాజేందర్, రక్షణాధికారి సంతోష్‌రావు, ఇంజినీర్ రఘు, సంక్షేమాధికారి భార్గవ్, అండర్ మేనేజర్ శ్యాంసుందర్, కార్మిక సంఘాల నాయకులు కారుకూరి తిరుపతి, కొత్తపల్లి శంకరయ్య, రాజకొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెండు క్వార్టర్లలో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పేపర్ మిల్లుకు చెందిన రెండు క్వార్టర్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని న్యూకాలనీ ఎస్పీఎం పర్మినెంట్ కార్మికుడు మల్లేశ్ ఓఆర్టీ–341లో క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మిల్లులో పనులకు వెళ్లగా, అతని భార్య భాగ్య ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. కుటుంబ సభ్యులు బుధవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని 40 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. ఓఆర్టీ–348లో నివాసం ఉంటున్న రవీందర్ రాత్రి విధులకు వెళ్లగా అతని భార్య సరిత తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. ఉదయం వచ్చి చూడగా తాళం వేసినట్లే ఉంది. లోనికి వెళ్లి చూడగా వెనుక తలుపు ఒక రెక్కను పూర్తిగా తొలగించి ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాలోని తులం బంగారు నగలు, రూ.84వేల నగదును అపహరించారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్సై అంజయ్య సంఘటన స్థలాలను సందర్శించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

రైలు కిందపడి ఇద్దరు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ ఫాం సమీపంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి, మంచిర్యాల శివారులోని గోదావరి సమీపంలోని రైల్వే పట్టాలపై గుర్తు తెలియని మహిళ బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతుల వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతునికి దాదాపు 40 సంవత్సరాలు ఉంటాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తాటిచెట్టుపై పిడుగు


తాటిచెట్టుపై మంటలు

బెజ్జూర్(సిర్పూర్): మండలంలోని కుంటలమానేపల్లి గ్రామ శివారులోని తాటిచెట్టుపై బుధవారం పిడుగుపడి మంటలు చెలరేగాయి. సాయంత్రం సమయంలో ఉరుములు మెరుపులతో కురిసిన వర్షంలో చెట్టుపై పిడుగు పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని వారు పేర్కొన్నారు.

పిడుగుపాటుతో దంపతులకు గాయాలు
భీమిని: కన్నెపెల్లి మండలంలోని రెబ్బనలో పిడుగుపడి దంపతులు గాయాలపాలయ్యారు. బుధవారం సాయంత్రం ఈదురుగాలులు ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి చెట్టుపై పిడుగు పడింది. సమీపంలోనే ఉన్న డేగల భానేష్, సాగరిక స్పృహ తప్పి పడిపోయారు, భానేష్‌కు స్వల్పగాయలు కాగా సాగరిక తీవ్ర అస్వస్థతకు గురైంది. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో మంచిర్యాలకు తరలించారు.

బీసీలందరికీ రూ.లక్ష సాయం వర్తింపజేయాలి


ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీ కులస్తులందరికీ రూ.లక్ష సాయం వర్తింజేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు బుధవారం కలెక్టరేట్‌లో ఏవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలలో 130 కులాలు ఉన్నాయని, కేవలం 15 కులాల వారికే పథకం వర్తింపజేయడం సరికాదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి బీసీలలోని అన్ని కులాల వారికి రూ.లక్ష సాయం అందేలా చర్యలు తీసుకోవాలని, పథకం గడువును కూడా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంశెట్టి నరేందర్, గుండోజు రమేశ్, పోలంపల్లి చంద్రమోహన్, శేఖర్, శ్రీనివాస్, బోనగిరి రాజారెడ్డి, ముత్తోజు రమేశ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'వాయిస్ ఫర్ బాయ్స్' సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆర్‌సీవో స్వరూపారాణి

జైపూర్: గురుకుల విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వాయిస్ ఫర్ బాయ్స్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కె.స్వరూపారాణి సూచించారు. మండల కేంద్రంలోని గురుకులంలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంగనర్ జిల్లాల్లోని 18 గురుకులాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన వాయిస్ ఫర్ బాయ్స్ క్యాంపును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సీవోఈ ప్రిన్సిపాల్ సైదులు, కోటపల్లి ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, స్థానిక వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు బాలభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.